క్లుప్తంగా

వధువుకు ఎమ్మెల్యే బూచేపల్లి ఆశీర్వాదం



వధువును ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తూము శ్రీనివాస్ రెడ్డి కుమార్తె వివాహానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బూచేపల్లికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఆదాం, నాగమల్లేశ్వర్‌రెడ్డి, నాగబొట్లపాలెం సర్పంచ్ సుబ్బారావు, మాజీ ఎంపీపీ మోషే, శ్రీ గుంటి గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవదానం, శ్రీనివాస్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

దర్శి: ప్రముఖ వైద్యుడు బాలయ్య కుమారుని వివాహ వేడుకలో దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. బాలీవుడ్ హాస్య నటుడు జానీ లివర్, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఉపాధ్యాయులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, యేరేసి ప్రసాద రెడ్డి పాల్గొన్నారు.



వధూవరులతో ఎమ్మెల్యే బూచేపల్లి

మహాసభలు జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అంజయ్య

దొనకొండ: నెల్లూరులో వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో సీపీఎం చేపట్టిన రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. గురువారం స్థానిక వీవీపురంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలతో నిస్వార్థ సేవ చేయడం, ప్రజా సంక్షేమంపై నిబద్ధతతో సీపీఎం ముందుండి పోరాటం చేస్తోందన్నారు. మండలంలోని సీపీఎం నాయకులు, కార్యకర్తలు తప్పక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు



చట్లమిట్లలో ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో సాయినాథునికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు బాబాకు పాలాభిషేకం చేసి పట్టు వస్త్రాలు ధరించారు. కాగడ హారతులిచ్చి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తులకు దాతల సాయంతో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రుణాల కోసం బీసీలు దరఖాస్తు చేసుకోవాలి

కురిచేడు: రుణాల కోసం బీసీలు, ఈబీసీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి. సతీష్ బాబు ఒక ప్రకటనలో కోరారు. వచ్చే నెల 7వ తేదీ వరకు దరఖాస్తులను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత మండల స్థాయిలో బ్యాంకుల సహకారంతో అర్హత పరిశీలన, ఫీల్డ్ వెరిఫికేషన్ అనంతరం ఎంపికైన లబ్ధిదారులకు మార్చి 10 నుంచి 20 వరకు రుణమేళాలో యూనిట్లు ప్రారంభించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్మెంట్ మానిటరింగ్ సిస్టం పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన బీసీ, ఈబీసీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వసంత రావు నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే వారు గ్రామ సచివాలయాల్లో ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్ వెనుక భాగంలో చెత్తాచెదారం



పెద్దారవీడు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ ఇలా..



తాగునీటి ట్యాంక్ చుట్టూ ఉన్న పిచ్చిచెట్లు

పెద్దారవీడు:

మండల కేంద్రం పెద్దారవీడులో ప్రయాణికుల కోసం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతతో దర్శనమిస్తోంది. ప్రభుత్వం లక్షలు నిధులు మంజూరు చేసి ప్రయాణికుల కోసం భవన నిర్మాణం, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి కోసం బోరు, నీటి ట్యాంక్, ప్రజలు కుర్చొనేందుకు అరుగులు ఏర్పాటు చేశారు. బస్టాండ్ భవనంపై చెట్లు పెరగడంతో గోడలు నెర్రలిచ్చాయి. వెనుక ప్రాంతంలో చిల్లకంప, చెత్తాచెదారం పేరుకు పోవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు బస్టాండ్ లోపలికి వెళ్లక పోవడంతో బస్సులు కూడా లోపలికి వెళ్లకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. బస్టాండ్ చుట్టూ పెద్ద పెద్ద ముళ్లకంప పెరిగిపోవడంతో విష పురుగులు సంచరించే అవకాశం ఉండటంతో స్థానికులు భయందోళన చెందుతున్నారు. అంతే కాకుండా మహిళలు, పురుషుల కోసం ప్రత్యేకంగా బస్టాండ్ వెనుక ఆవరణలో మరుగుదొడ్లు, ప్రయాణికుల కోసం పక్కన తాగునీటి కోసం ట్యాంక్‌ను నిర్మించారు. మరుగుదొడ్లు, నీటి ట్యాంక్‌ను వినియోగించక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో అత్యవసర సమయాల్లో ఒకటి, రెండింటికి ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు ఆరుబయట మూత్రం పోస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్‌లోకి వచ్చిన ప్రజలు, ప్రయాణికులు ముక్కు మూసుకుని బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్ ఆవరణలో విద్యుత్ బల్బులు లేకపోవడంతో బస్సులో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు రాత్రి పూట ఎక్కడ దిగాలో తెలియక బస్టాండ్‌కు దూరంగా దిగుతున్నారు. ఇక వర్షం కురిస్తే బస్టాండ్ ఆవరణలో ఉన్న గుంతల్లో వర్షం నీరు చేరుతుంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్టాండ్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో పారిశుధ్య పనులు చేట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



వృథాగా ఉన్న మరుగుదొడ్లు

ఇంటర్వ్యూకు వెళ్లకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

● గిరిజన మహిళ డిమాండ్

పెద్దదోర్నాల: తనను ఇంటర్వ్యూకు వెళ్లకుండా అడ్డుకున్న అంగన్‌వాడీ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని మండలానికి చెందిన గిరిజన మహిళ మాత్రా లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎస్టీ రిజర్వు అయిన కోడ్ నెం 809209 అంగన్‌వాడీ సెంటర్‌కు సంబంధించి కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి కాల్ లెటర్ సైతం వచ్చినట్లు తెలిపారు. 27వ తేదీ రాత్రి 9.37 గంటలకు 96034 97977 నంబర్ నుంచి విజయ అనే ఉద్యోగి ఫోన్ చేసి 28వ తేదీన మీకు ఇంటర్వ్యూ లేదని, మీకు మళ్లీ ఫోన్ చేసి ఇంటర్వ్యూ ఎప్పుడనేది తెలియజేస్తామంటూ తనను ఇంటర్వ్యూకు వెళ్లకుండా అడ్డుకున్నారని లక్ష్మీదేవి ఆరోపిస్తోంది. 28వ తేదీన ఇంటర్వ్యూలు జరిగాయని, తనను తప్పుదోవ పట్టించిన సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై లక్ష్మీదేవికి ఫోన్ చేసిన ఉద్యోగి వివరణ తీసుకోవాలని ప్రయత్నించినా ఆమె స్పందించలేదు.



లక్ష్మీదేవికి వచ్చిన కాల్ లెటర్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

● మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అందరూ సమన్వయంగా పనిచేసినప్పుడే అది సాధ్యమవుతుందని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివి నాగ్ అన్నారు. గురువారం స్థానిక బాల త్రిపురసుందరిదేవి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శివరాత్రి పండగ సందర్భంగా జరిగే పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తారని, వారు ప్రశాంతంగా స్వామి దర్శనం చేసుకునేందుకు వీలుగా చూడాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, భక్తులు అనారోగ్యానికి గురికాకుండా వైద్యాధికారులు పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉభయ దేవాలయాల వద్ద చలువ పందిర్లు, క్యూలైన్ ఏర్పాట్లు, విద్యుద్దీపాలు, తాగునీటి సౌకర్యం, ప్రత్యేక పూజా కార్యక్రమాల ఏర్పాట్లను దేవాలయ అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, సీఐ హసన్, ఎంపీపీ రిబకమ్మ, ఈవోపీఆర్డీ రామ సుబ్బయ్య పాల్గొన్నారు.

మినుము, నువ్వులు సాగు చేసుకోవాలి



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి: రైతులు వేసవి పంటలుగా నువ్వులు, మినుము పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో జనవరి మాసానికి సంబంధించి శిక్షణ, సందర్శన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆమె వ్యవసాయాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం నీటి వసతి ఉన్న రైతులు, నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులంతా నువ్వులు లేదా మినుము పంట వేస్తే లాభదాయకంగా దిగుబడులు పొందొచ్చన్నారు. సేంద్రియ ఎరువులతో పాటు పోషకాలను కూడా పైపాటుగా లేదా ద్రవ రూపంలో వాడుకుంటే పైర్లను ఆరోగ్యవంతంగా ఉంచుకొని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ప్రతినిధిగా ఒంగోలు నుంచి విచ్చేసిన సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ రైతులంతా ఖరీఫ్ పంటలను తగిన సమయంలో కోసుకొని తగినంతం తేమ ఉండేంత వరకు ఎండలో ఆరబెట్టుకోవాలని సూచించారు. రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి పురుగులు, తెగుళ్లను అదుపులో ఉంచుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో నాగార్జున సాగర్ కాల్వ ప్రాంతంలో సాగు చేసే రైతులు వేసవిలో సాగు చేసుకోదగ్గ రకాలను, వాటి పోషక, కలుపు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వేసవి కాలానికి మినుపంటలో టీబీసీ 104, వీబీఎన్ 8 అనే రకాలు సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ రకాలకు రెండు నీటి తడులు అవసరమని తెలిపారు. నువ్వుల్లో వైఎల్ఎం 66 రకంతో పాటు వైఎల్ఎం 146 రకాన్ని రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. మొక్కజొన్న కండె తీసుకునే దశలో ఉందని, ఈ దశలో అవసరమైతే రైతులు ఒక నీటి తడిని తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు మాట్లాడుతూ ఆలస్యంగా విత్తన కంది పంటలో కాయ ఈగ, అలాగే లద్దె పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరానికి 40 మిలీ పోరాటానిలిప్రోలు లేదా ఎకరానికి 80 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోఎటును పిచికారీ చేయాలని సూచించారు. మిరప పంటలో ఎక్కువగా నత్రజని ఎరువులను, కాంప్లెక్స్ ఎరువులను వాడితే ఆకుముడత, బొబ్బరకు వైరస్ అధికంగా ఆశిస్తున్నాయని తెలిపారు. వీటి నివారణకు రైతులు నత్రజని ఎరువులను మోతాదు మేరకే వాడుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త హరిత, మానస, ఏడీఏలు పాల్గొన్నారు.

చెప్పులు కుట్టిన చేతులతో చరిత్ర రాస్తాం..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యర్రగొండపాలెం: చెప్పులు కుట్టిన చేతులతో చరిత్ర రాస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మండాది పీటర్ మాదిగ అన్నారు. గురువారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, కోర్టు ఆదేశాలను గౌరవించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 4వ తేదీన యర్రగొండపాలెంలో జరిగే మాదిగ మేధావుల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుమలయ్య మాదిగ, గర్నపూడి వినయ్, సింగా ప్రసాద్, ఉప్పలపాటి రమేష్, కొండయ్య, సుధాకర్, కె.వెస్లీ, ఆర్.ప్రసాద్, ఎం.రాజు, ఎం.కన్నబాబు, నాసరయ్య, దాస్, సి.అశోక్, విజయ్, షేక్ బాష పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

దర్శి: మండలంలోని వివిధ గ్రామాల పరిధి రైతు సేవా కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి బసవయ్య కోరారు. మండలంలోని శామంతపూడి రైతు సేవా కేంద్రం పరిధి నిమ్మారెడ్డిపాలెంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎదకురాని పశువులను పరీక్షించి వాటికి మినరల్స్, విటమిన్ ఇంజెక్షన్లు వేశారు. ఒక మేక పురిటి నొప్పులతో బాధపడుతుంటే దానికి వైద్యాధికారి బసవయ్య డెలివరీ చేశారు. గర్భంలో చనిపోయిన మేకపిల్లను బయటకు తీశారు. 32 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు.



మేకకు డెలివరీ చేస్తున్న డాక్టర్ బసవయ్య

గాంధీకి ఘన నివాళులు



దర్శి: గాంధీకి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయనకు ఘన నివాళులర్పించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగం దేశ ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా గ్రామ గ్రామాన సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేయడం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. గాంధీజీలా ఆలోచించే మంచి సేవా గుణం ఒక్క మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్పష్టం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు గాంధీ సేవలు కొనియాడారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పెండ్యాల సాంబశివ రావు, దేవతి సత్యనారాయణ గుప్తా, పానుగంటి మోహన్‌రావు, సముద్రాల సుబ్బయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు ఏసుదాసు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అమీన్‌బాషా, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నాయకులు శీలం శ్రీనివాస రెడ్డి, పానుగంట కోటేశ్వరరావు, పాశం జయసింహా రావు, ఉడుముల వెంకటరెడ్డి, చెరుకూరి జగన్, రామిరెడ్డి, పేరం రమేష్‌రెడ్డి, షేక్ మజ్జువలి, కుందురు నరసింహారెడ్డి, కొడవటి జాన్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పుల్లలచెరువు: గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు



త్రిపురాంతకం: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

పుల్లలచెరువు: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ కె.జానకిరఘు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం స్థానిక గాంధీ కళాక్షేత్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న రఘు మాట్లాడుతూ గాంధీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకు రావడంతో భారతీయులకు మహాత్ముడయ్యారన్నారు. వక్తలు గాంధీ చేసిన సేవలను కొనియాడారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గురునాథం, పుర ప్రముఖులు జి.భాస్కరరావు, హనుమంతరావు, సీహెచ్ సుబ్బారావు, డీలర్ వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, కొండలు, కోటిరెడ్డి, మాజీ సైనికుడు బుజ్జి, కిష్టయ్య, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు కాళ్ల హనుమంతురావు, ఏ.శంకర్, బీవీ శేఖర్, పట్టణ నాయకులు పి.రమేష్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో..

స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ ఆధ్వర్యంలో కార్యదర్శి పి.కృష్ణమూరి, వార్డు సభ్యులు, పారిశుధ్య కార్మికులు మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు పూర్ణ నాగేశ్వరరావు, సాంబయ్య, శేఖరు, చీతిరాల హనుమంతరావు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ కోసం స్థలం పరిశీలన

ముండ్లమూరు (దర్శి): స్థానిక పోలీసుస్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని ఒంగోలు నుంచి వచ్చిన వెల్ఫేర్ ఆర్ఐ గురువారం పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా స్థలాన్ని వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని సూచించారు.



పోలీసుస్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

మిర్చి పంట పరిశీలన

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఉమామహేశ్వరపురంలో సాగు చేసిన మిర్చి పంటను ఉద్యాన శాఖాధికారి ఎం.రవి వెంకన్నబాబు గురువారం పరిశీలించారు. మిరప పంటను సాగు చేసే రైతులు సస్యరక్షణ చేపట్టాలని తెలిపారు. మిరప పంటలో నల్లి, తామర పురుగులు ఎక్కువగా ఉండటాన్ని ఆయన గమనించి వాటి నివారణ చర్యల గురించి వివరించారు. నల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి ఆకులు వెనక్కు ముడుచుకుపోయి పడవ ఆకారంలో కనిపిస్తాయన్నారు. దీని నివారణకు డైకోఫాల్ 5 మిలీ లేదా నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా క్లోరిఫిన్‌ఫైర్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. తామర పురుగులు ఆకు అడుగు భాగంలో గుంపులుగా చేరి రసాన్ని పీల్చడంతో ఆకులపై బొబ్బర ఏర్పడి ఆకు అంచులు పైకి ముడుసుకుపోతాయన్నారు. ఈ పురుగులు కాయలను ఆశించి రసాన్ని పీల్చడంతో కాయలు మీద చారలు ఏర్పడి గిడస బారతాయన్నారు. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 మి.లీ లేదా పిప్రోనిల్ 2 మి.లీ లేదా క్లోరోఫిన్ 2 మిలీ లీటరు నీటికి కలిపి అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలని సూచించారు.

దళితుల భూమిని ఆక్రమించిన వారిపై కేసు



సీఐ రామారావుతో మాట్లాడుతున్న దళిత నేత నీలం నాగేంద్రరావు

తాళ్లూరు: మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన దళితులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించి పంటను నష్టం చేసిన ఎడ్ల మల్లయ్య ముఠాపై గురువారం కేసు నమోదైంది. దళిత నేత నీలం నాగేంద్రరావు కృషితో నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేశారు. చింతలపాలెంలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం ఎడ్ల మల్లయ్య ముఠా భూమి ఆక్రమించుకుంది. ఈ విషయమై దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కేసు నమోదు చేయించారు. దర్శి సీఐ వై.రామారావు, తాళ్లూరు ఎస్సై మల్లికార్జునరావులు పొలాలను పరిశీలించారు. తమ భూములు తమకు ఇప్పించి న్యాయం చేయాలని దళితులు సీఐను కోరారు. ఎడ్ల మల్లయ్య ముఠాను వెంటనే అరెస్టు చేయాలని దారా అంజయ్య డిమాండ్ చేశారు.